విశాలాంధ్ర
అనకాపల్లి
బుధవారం 12, జూన్, 2024

నారా లోకేష్‌ను సత్కరించిన నాగజగదీష్

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబును ఆ పార్టీ మాజీ శాసనమండలి సభ్యులు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ధ నాగ జగదీశ్వరరావు మంగళవారం ఉండవల్లిలో వారి స్వగృహంలో కలిశారు. ఇటీవల శాసనసభ ఎన్నికల్లో మంగళగిరి శాసనసభ నియోజకవర్గం నుండి అత్యధిక మెజార్టీతో ఎన్నికైన సందర్భంగా స్వీట్లు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువాతో సత్కరించి అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు కలియుగ ఆరాధ్య దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని బహుకరించారు.

ఆగని గ్రావెల్ అక్రమ తరలింపు

- ల్యాండ్ పూలింగ్‌లో యధేచ్ఛగా తవ్వకం
- ప్రభుత్వం మారినా...ఆగని వైసీపీ శ్రేణుల దందా

విశాలాంధ్ర - పరవాడ: పరవాడ మండలం పెదముషిడివాడలో గ్రావెల్ అక్రమ తరలింపునకు ఇంకా అడ్డుకట్ట పడలేదు. ల్యాండ్ పూలింగ్ ప్రాంతంలో వైసీపీ నేతల కనుసన్నలలో యధేచ్ఛగా అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. రాష్ట్రంలో వైసీపీ అధికారం కోల్పోయి నప్పటికీ గ్రావెల్ దందాకు ఆ పార్టీ శ్రేణులు ఫుల్‌స్టాప్ పెట్టలేదు. మంగళవారం తెల్లవారుజామున కూడా ఎక్స్‌వేటర్‌తో తవ్వకాలు జరిపి లారీలతో గ్రావెల్ తరలించారు. తెల్లవారుజాము నాలుగు గంల నుంచి ఉదయం 8 గంటల వరకూ సుమారు 60 ట్రిప్పుల వరకూ గ్రావెల్‌ను తరలించారు.

పంచాయతీలో జరుగుతున్న పునాదుల ఫిల్లిం గ్‌కు తరలించడంతో పాటు లంకెలపాలెం, అగనం పూడి, సాలాపువానిపాలెం తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు. మరో పక్క ప్రంచాయితీలో విచ్చలవిడిగా జరుగుతున్న ఆక్రమణలకు కూడా గ్రావెల్ తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. పగటి వేళ నిర్మాణ దారులతో ఒప్పందం కుదుర్చుకుని అర్ధరాత్రి వేళ, తెల్లవారు జాము వంటి సమయాల్లో అక్రమ గ్రావెల్ తవ్వకాలకు పాల్పడుతున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా గ్రావెల్ తరలిస్తుండడం పట్ల గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ గ్రావెల్ తరలింపుపై రెవెన్యూ, మైనింగ్, పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపి స్తున్నారు. ఇప్పటికైనా అక్రమ గ్రావెల్ తరలింపునకు అధికారులు అడ్డుకట్ట వేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఉపాధి హామీ వీఆర్పీ ఆగడాలు

- వీఆర్పీ నిర్లక్ష్యంతో కుదించుకుపోతున్న పనిదినాలు
- విజయరామరాజుపేట గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్‌లో అవకతవకలు
- ఇబ్బంది పడుతున్న ఉపాధి హామీ కూలీలు

విశాలాంధ్ర - బుచ్చయ్యపేట: బుచ్చయ్యపేట మండలం విజయ రామరాజుపేట గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్‌లో అవకతవకలు జరుగు తున్నాయని గ్రామంలో వీఆర్పీ నిర్లక్ష్యంతో పని దినాలు కుదించుకు పోతున్నాయని వారానికి మూడు నుంచి నాలుగు రోజులు మాత్రమే పని కల్పిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఒకవేళ ఆరు రోజులు పనిచేస్తున్నా కూడా మూడు రోజులకు సుమారు 900 రూపాయలు మాత్రమే వస్తున్నాయని అంటున్నారు. తమ కష్టానికి తగిన ప్రతిఫలం దక్కడం లేదని కొందరికి మాత్రం సుమారు 1600 రూపాయల వేతనం అందుతుందని అన్నారు. అధికారులకు ఎవరైతే వంద రూపా యలు ఇస్తున్నారో వారికి మాత్రం1600 వస్తున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విధంగా ఎందుకు జరుగుతుంది అని ఎవరైనా అడిగితే వాళ్లకు తర్వాత వారం పని దినములు పెట్టడంలేదని మహిళలని కూడా చూడకుండా నోటికి వచ్చినట్టు దుర్భాషలు ఆడుతున్నారని అంటున్నారు. గ్రామంలో సుమారు 400 జాబ్ కార్డులు ఉన్నప్పటికీ సమయాభావాన్ని సాకుగా చూపించి కేవలం 250 మందికి మాత్రమే పని కల్పిస్తున్నారని వేతనదారులను తెల్లవారుజామున మూడున్నర గంటలు పనికి హాజరుకావాలని ఇబ్బంది పెట్టడంతో ఆ చీకటి సమయంలో విషపురుగుల ఉంటాయనే బెడదతో కొంతమంది సమయానికి హాజరు కాకపోవడంతో వారికి పనిలో మస్తరు కల్పించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బెడ్ బ్యాండ్ వర్కులు ఐడీలు మారుస్తూ వీఆర్పీ వారికి నచ్చిన చోట నచ్చిన విధంగా పనులు చేయిస్తున్నారని ప్రజలు ఎవరైనా ఎందుకు అలా చేస్తున్నావు అని అడిగితే వారిని దుర్భాష లాడుతూ పని కల్పించే పరిస్థితి ఉండదని భయపెడుతున్నారని వాపోతున్నారు. అధికారులు స్పందించి వీఆర్పీని మార్చాలని పలువురు కోరుతున్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు సహకరించండి

- నేడు బాల కార్మికుల వ్యతిరేఖ దినోత్సవం

విశాలాంధ్ర - చోడవరం: నేటి బాలలే రేపటి భావి భారత పౌరులు అన్న మాటకు అన్ని విధాలా ఆదుకోవాలని, సహకరిం చాలని, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రభుత్వాలు, ప్రజలు కృషి చేయాలని పలు ప్రజా మహిళా సంఘాలు కోరుతున్నాయి. బాల కార్మికులు అనే పదం బాల్యాన్ని, వారి సామర్థ్యాన్ని, గౌరవాన్ని కోల్పోయే పనిగా తెలియజేయబడుతోంది. బాల కార్మికులు వ్యవస్థ నిర్మూలించాల్సిన ఆవశ్యకత గురించి అవగాహన కల్పించేందుకు ఐక్య రాజ్య సమితి ప్రత్యేక విభాగమైన అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐ.ఎల్.ఓ) 2002లో జూన్ 12న ప్రపంచ బాల కార్మికుల వ్యతిరేఖ దినోత్సవం ప్రారంభించింది. ప్రభుత్వాలు, అధికారులు, పౌర సమాజం, కార్మికులు, యజమానులు, సంస్థలు కలిసి బాల కార్మికుల సమస్యను ఎత్తి చూపడానికి, సహాయం చేయడానికి, మార్గదర్శ కాలను చూపడానికి ఇవన్నీ కలిసి కృషి చేయాలి. అన్ని వయస్సులు గల కార్మికులకు నాణ్యమైన ఉచిత విద్యను అందించేందుకు చర్యలు తీసుకోవాలి. బాల కార్మికులను గుర్తించి, వారికి అన్ని వసతులు కల్పించితే బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు సహాయ పడుతుందని ప్రజా సంఘాలు చెబుతున్నాయి.

11 కోఆపరేటివ్ సొసైటీ నామినేటెడ్ పోస్టులకి రాజీనామా

విశాలాంధ్ర - యలమంచిలి: యలమంచిలి మార్కెట్ కమిటీ పాలక మండలి పదవికి రాజీనామా చేయనున్నట్లు ప్రస్తుత చైర్మన్ ఎర్రయ్యదొర తెలిపారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసీపీ ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ, మార్కెట్ కమిటీతోపాటు నియోజకవర్గంలో ఉన్న 11 కోఆపరేటివ్ సొసైటీల త్రిసభ్య కమిటీల తాత్కాలిక అధ్య క్షులు, కార్యవర్గ సభ్యులు వైసీపీ ఓటమికి నైతిక బాధ్యతగా తమ పదవులకు మంగళవారం రాజీనామా చేస్తున్నట్లు ఎర్రయ్య దొర తెలిపారు. ఈ రాజీనామా పత్రాన్ని వైసీపీ సీనియర్ నాయకులు డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార్ వర్మకు అందజేశారు. ఈ సంద ర్భంగా సుకుమార్ వర్మ మాట్లాడుతూ ఇప్పుడు వరకు వైసిపి ప్రభు త్వంలో రైతులకు పలు సంక్షేమ కార్యక్రమాలతో పాటు సబ్సిడీలు అందజేశామన్నారు. ఇకపై ప్రతిపక్షంగా ఉండి రైతుల పక్షాన పని చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కస్పా రవికుమార్, నియోజకవర్గ సచివాలయ కన్వీనర్

నీరుకొండ వెంకట సూరి నారాయణ, మల్ల కొండబాబు, నియోజకవర్గంలో ఉన్న 11 సహకార సొసైటీల అధ్యక్షులు రాజీనామా చేసిన వారు పాల్గొన్నారు.

నీట్ పరీక్షపై జరుగుతున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలి

విశాలాంధ్ర - యలమంచిలి: నీట్ యూజీ 2024 ఫలితాల్లో హర్యానాకు చెందిన ఒకే పరీక్షా కేంద్రంలో ఏడుగురు విద్యార్థులకు ఆలిండియా ఫస్ట్ ర్యాంక్ రావడం, వారందరికీ 720/720 మార్కులు రావడంతో ఎన్నో అనుమానాలకు దారితీస్తోందని ఎస్ఎఫ్ఐ యలమంచిలి డివిజన్ కమిటీ నాయకులు అన్నారు. అదే సెంటర్లో పరీక్ష రాసిన జాన్వీ అనే విద్యార్థిని 179 ప్రశ్నలను రాయగా అందులో 163 కరెక్ట్ అయ్యాయని, ఆమెకు 636 మార్కులు రావాలి కానీ 720/720 ఎలా వచ్చాయంటూ ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని తెలిపారు. ఎంతోమంది విద్యార్థులకు సాధ్యం కాని విధంగా 718, 719 మార్కులు వచ్చాయని, (4,-1) విధానాన్ని నీట్ ఎగ్జామ్ ఫాలో అవుతాయని అన్నారు. అలా చూసుకుంటే 718, 719 మార్కులు ఎలా సాధ్యమని నెట్టింట ప్రశ్నలు లేవనెత్తుతున్నాయన్నారు. ఈ నీట్ ఎగ్జామ్ వివాదంపై ఎన్టీఏ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) వివరణ ఇస్తూ పరీక్షలో సమయం కోల్పోయినట్లు నివేదించిన అభ్యర్థులకు గ్రేస్ మార్కులు ఇవ్వడం వల్ల 718, 719 మార్కులు వచ్చాయని, ఒక ప్రశ్నకు రెండు సరైన సమాధానాలు ఉన్నాయని, అందువల్ల రెండు ఆప్షన్లు సరైనవిగా ప్రకటించి 44 మంది అభ్యర్థుల మార్కులు 715 నుంచి 720కి పెరిగాయని వివరించిందన్నారు. కానీ కొంత మంది విద్యార్థులకు 100 పైగా గ్రేస్ మార్కులు కలిపారని, ఇదిలా వుంటే మొదటి సారి జూన్ 14 తారీకున ఫలితాలు విడుదల చేస్తామని ప్రకటించి ఎన్నికల కౌంటింగ్ రోజున (జూన్ 4) పరీక్షా ఫలితాలు విడుదల చేయటంతో ఎన్నో సందేహాలు ఉన్నాయన్నారు. వెంటనే విచారణ జరపాలని అన్నారు.

మోదకొండమ్మ తల్లికి పసుపు నీళ్ల జలాభిషేకం

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగుల శ్రీ మోదకొండమ్మ అమ్మవారికి మంగళవారం ఉదయం వర్షాలు కురవాలంటూ అమ్మవారి శతకంపట్టు వద్ద పాదాలకు మాడుగులకు చెందిన మాల ధరించిన మాతలు, మహిళలు, భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పసుపు నీళ్ల జలాభిషేకం నిర్వహించి అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులందరికీ ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. దీంతో మాడుగుల వీధి నుండి అనేకమంది మహిళలు పసుపు నీళ్ల బిందెలతో తరలివచ్చి అమ్మవారికి పసుపు నీళ్ల అభిషేకం నిర్వహించారు. దీంతో సతకంపట్టు వద్ద పండుగ వాతావరణం ఏర్పడింది.

కొత్తవీధి కొందు పివిటిజి ఆదివాసీల సాగుబడికి రక్షణ కల్పించాలి

దొంగ రిజిస్ట్రేషన్లు రద్దు చేయాలి

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: కొత్త వీధి కొందు పివిటిజి ఆదివాసీల సాగుబడికి రక్షణ కల్పించాలని, సాగు హక్కుల నమోదు చేయాలని అఖిల భారతి వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం, జాతీయ కార్యదర్శి పి.ఎస్.అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. జిల్లాలో చీడికాడ మండలం, కోనాం శివారు కొత్తవీధి కొందు పివిటిజి ఆదివాసీలు మంగళవారం విశాఖలోని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ డిప్యూటీ ఇన్స్పెక్టర్ జనరల్ (డిఐజి)ను కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోనాం గ్రామంలోని సర్వే నెంబర్ 289-1ఏలో 8 ఎకరాల సీలింగ్ మిగులు భూములను కలుపుకొని 37 ఎకరాలకు రిజిస్ట్రేషన్లు చేశారని, ఆ సమయంలో చీడికాడ మండలం, తహశీల్దార్‌గా పనిచేసిన అధికారి మాడుగుల సబ్ రిజిస్టర్ భూ మాఫియాతో చేతులు కలిపారని ప్రభుత్వ ఆస్తిని ప్రైవేటు ఆస్తిగా చూపించి మోసానికి పాల్పడ్డారని ఆరోపించారు. నిషేధపు ఉత్తర్వుల పుస్తకంలో ఉన్నప్పటికీ అప్పటి వద్దాది మాడుగుల సబ్ రిజిస్టర్, అప్పటి చీడికాడ తహశీల్దార్ భూ మాఫియాతో చేతులు కలిపి, 50 లక్షల విలువైన 8 ఎకరాల సీలింగ్ మిగులు భూమిని జిరాయితీ భూమిగా చూపిస్తూ రికార్డుల్లో మార్పు చేశారని, వాటిని ముందు పెట్టుకొని మాడుగుల సబ్ రిజిస్టర్ ఐదు రిజిస్ట్రేషన్లు చేశారని ఆయన తెలిపారు. ఆ భూములలో సాగులో ఉన్న ఆది వాసీలు విజయవాడలోని కమీషనర్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ వారికి ఫిర్యాదు చేశారని, కమిషనర్ ఆదేశాలపై జిల్లా రిజిస్ట్రేషన్ అధికారి విచారణ జరిపారని అజయ్ కుమార్ గుర్తు చేశారు. ఈ విచారణలో జరిగిన అక్రమాలు బయటపడినప్పటికీ ఈరోజు వరకు దస్తా వేజులను రద్దు చేయడం గాని, రిజిస్ట్రేషన్ చేసిన సబ్ రిజిస్టర్‌పై చర్యలు తీసుకోవడం గాని, రికార్డును తారుమారు చేసిన తహశీల్దార్‌ను విధుల నుండి తొలగించడం గాని జరగలేదని అన్నారు. విశాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్, విజయనగరం డిప్యూటీ ఇన్స్పెక్టర్ జనరల్, అనకాపల్లి జిల్లా రిజిస్ట్రేషన్ అధికారిని 2023 జూలై నెలలోనే చర్యలు తీసుకోమని కోరుతూ కమిషనర్ ఆదేశాలు ఇచ్చారని, ఇప్పటికి 11 నెలలు గడుస్తుందని కానీ ఎలాంటి చర్యలు లేవని అజయ్ కుమార్ అన్నారు.

ఈలోగా భూ మాఫియా ఈ భూములను అమ్మి వేయడానికి ప్రయత్నం చేస్తుందని, సాగులో ఉన్న ఆదివాసీలను భయభ్రాంతులకు గురిచేస్తుందన్నారు. ఇప్పటికైనా అనకాపల్లి జిల్లా కలెక్టర్, జిల్లా రిజిస్ట్రేషన్ అధికారి, విశాఖలోని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, అటు రెవెన్యూ సిబ్బంది పైన, ఇటు రిజిస్ట్రేషన్ సిబ్బందిపైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తరతరాలుగా భూమిని నమ్ముకుని, ఆ భూములోనే ఒక గ్రామాన్ని నిర్మించుకొని జీవిస్తున్న కొందు పివిటిజి ఆదివాసీల సాగుహక్కులను నమోదు చేయాలని, వారి సాగుబడికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

నేడు ఏపీ సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం



- కూటమి నేతలంతా చలో విజయవాడ
- ఇప్పటికే ఎమ్మెల్యేలు, ఎంపీలు అంతా అక్కడే
- మంత్రులయ్యేదెవరో తేలేది నేడే

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: రాష్ట్రంలో టీడీపీ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం నేడు కొలువు తీరనుంది. ఏపీ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు నాలుగోసారి బాధ్యతలు స్వీకరిం చనున్నారు. విజయవాడ సమీపంలో గన్నవరం వద్ద ఏర్పాటు చేస్తున్న ప్రమాణ స్వీకార మహోత్సవానికి కూటమి నేతలంతా చలో విజయవాడ అంటూ మంగళవారం ఉదయం నుండి బయలుదేరి వెళ్లారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో 32 నియోజకవర్గాల నుండి గెలుపొందిన కూటమి ఎమ్మెల్యేలంతా ఇప్పటికే విజయవాడలో బస చేశారు. ఎంపీలు కూడా ఢిల్లీలో ఎన్డీఏ నూతన ప్రభుత్వ ప్రమాణ స్వీకార మహోత్సవం చూసుకొని ఢిల్లీ నుండి విజయవాడ చేరుకున్నారు. మరో పక్క ప్రతి నియోజకవర్గం నుండి వందలాదిమంది ప్రత్యేక వాహనాల్లో చలో విజయవాడ అంటూ ప్రమాణ స్వీకారం మహోత్సవానికి తరలి వెళ్లారు. విశాఖ జిల్లా నుండి విశాఖ తూర్పు, పశ్చిమ, దక్షిణ, ఉత్తర, భీమిలి, గాజువాక, పెందుర్తి నియోజకవర్గాల నుండి భారీగా కార్యకర్తలు, నేతలు తరలి వెళ్లారు. జీవీఎంసీలో కార్పొరేటర్లు వార్డు అధ్యక్షులు ప్రత్యేక వాహనాల్లో చంద్రబాబు ప్రమాణ స్వీకారం మహోత్సవానికి

విశాఖ దక్షిణ నియోజకవర్గం నుండి నియోజకవర్గ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్ ఆధ్వర్యంలో విజయవాడకు తరలి వెళ్తున్న టిడిపి కార్యకర్తలు

పరుగులు తీశారు. ఐదేళ్లుగా అధికారానికి దూరమైన కూటమి పార్టీలు క్యాడర్ అంతా నూతన ఉత్సాహంతో ప్రమాణ స్వీకార మహోత్సవం నుండి తమ ప్రభుత్వం రాష్ట్రంలో నూతన పాలన అందిస్తుందని ఆశా భావం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పాలనకు పెద్దపీట వేసేలా చంద్రబాబు సారధ్యంలో కూటమి ప్రభుత్వం కొలువు తీర నుంది. ఈ ప్రమాణ స్వీకార మహోత్సవానికి దేశ ప్రధాని మోదీతో పాటు కేంద్ర మంత్రులు అమిత్ షా, రఘునాథ్ సింగ్, రామ్మోహన్ నాయుడు, కిషన్ రెడ్డి, నిర్మల సీతారామన్‌తో పాటు ఎన్డీఏ నేతలంతా హాజరు కానున్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన, అగ్రనేతలంతా నేడు చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి హాజరుకానున్న నేపథ్యంలో వార్డు స్థాయి నుంచి నియోజకవర్గం స్థాయి కార్యకర్తలు నేతలు అంతా విజయ వాడకు తరలి వెళ్లారు. మరొక్క రాష్ట్ర మంత్రివర్గంలో ఎవరికి చోటు దక్కుతుందో అన్న ఉత్కంఠకు నేడు తెరపడనుంది. ఇప్పటికే జిల్లాల నుండి తమ బలాన్ని నిరూపించుకునేందుకు గెలిచిన ఎమ్మె ల్యేలంతా వేలాదిమంది ఈ ప్రమాణ స్వీకారం మహోత్సవానికి తీసుకు వెళ్లారు. మళ్లీ జిల్లాకు వచ్చేటప్పుడు మంత్రి హోదాలో వస్తామని భారీ స్వాగత ఏర్పాట్లు చేయాలని ఇప్పటికే అనేకమంది నేతలు జిల్లాలో క్యాడర్‌కు చెప్పినట్లు తెలుస్తోంది. ప్రతి జిల్లా నుండి ఓటమిలో ఉన్న మూడు పార్టీల నేతలు మంత్రి పదవుల కోసం తమ చివరి ప్రయత్నాలన్నీ నేటితో ముగియనున్నాయి.

మోడల్ స్కూల్‌లో మిగులు సీట్లకు దరఖాస్తులు చేసుకోవాలి

విశాలాంధ్ర - చీడికాడ: మండలంలోని చీడికాడ మంచాల ఏపీ మోడల్ స్కూల్‌లో 2024-25 విద్యా సంవత్సరానికి 6, 7, 8 తరగతులలో మిగిలిన సీట్లకు విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రధానోపాధ్యా యురాలు వెంకటలక్ష్మి అన్నారు. ఈ నెల 15వ తేది శనివారం ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. పరీక్ష గత సంవత్సరం సిలబస్‌పై ఉంటుందన్నారు. ఆసక్తిగల విద్యార్థులు పాఠశాలలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు ప్రిన్సిపాల్ సిబ్బందిని సంప్రదించాలని కోరారు.

తప్పిన పెను ప్రమాదం

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలో గోకులపాడు గ్రామంలో జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం విశాఖ నుంచి రాజమండ్రి వైపు వెళ్తున్న లారీ ఒక ఇంటి పైకి దూసుకొని పోయింది. ఈ లారీ కర్ణాటక వెళ్తున్నది. అయితే ఇదే సమయంలో ఇంటి బయట ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

తాళ్లమ్మ తల్లికి మొక్కు తీర్చుకున్న కూటమి నాయకులు

విశాలాంధ్ర - యలమంచిలి: యలమంచిలి ఎమ్మెల్యేగా సుందరపు విజయకుమార్ అఖండ విజయం సాధించాలని కోరుతూ మండలంలో పోతిరెడ్డిపాలెంలో తాళ్లమ్మ తల్లికి కూటమి నాయకులు మొక్కులను మంగళవారం తీర్చుకున్నారు. టీడీపీ, జనసేన నాయకులు అమ్మవారికి 101 కొబ్బరికాయ కొట్టి మొక్కు తీర్చు కున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, టీడీపీ నాయకులు ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, యలమంచిలి పట్టణ పార్టీ అధ్యక్షులు బొద్దపు శ్రీను, కాళ్ల సత్యనారాయణ, టీడీపీ నాయకులు, జన సైనికులు పాల్గొన్నారు.

టోల్ గేట్ వద్ద వాహనాలు తనిఖీ

విశాలాంధ్ర - నక్కపల్లి: మండలంలో సీఐ ఎ.విజయ్ కుమార్ తన సిబ్బందితో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విశాఖపట్నం నుండి విజయవాడ వైపు వెళ్తున్న వాహనాలను వేంపాడు టోల్‌గేట్ వద్ద తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ నేడు అమరావతిలో జరగబోయే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకార మహోత్సవంకు సంబంధించి ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.